

అంబేద్కర్ వర్సిటీకి రూ.20 కోట్లు మంజూరు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి కేంద్ర విద్యాశాఖ పీఎం ఉషా (ప్రధాన మంత్రి ఉచ్చతార్ శిక్షా అభియాన్) రూ.20 కోట్లను మంజూరు చేస్తూ ఉత్వర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 61 యూనివర్సిటీలకు నిధులు మంజూరుచేయగా, రెండో విడతగా 12 యూనివర్సిటీలకు నిధులు కేటాయించింది. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీకి చోటు దక్కింది. దీంతో వర్సిటీ అభివృద్ధికి మార్గం సుగమం అయింది. పీఎం ఉషాకు అప్పటి వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు హయాంలో ప్రతిపాదనలు పంపారు. రానున్న ఐదేళ్లలో ఈ నిధులు విడతల వారీగా విడుదల చేస్తారు. కొత్తగా భవనాల నిర్మాణం, పాతవాటిని మెరుగుపర్చడం, వివిధ కోర్సుల లేబ్ల అభివృద్ధి, విద్యార్థుల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంపొందించేలా సర్టిఫికేటు కోర్సుల శిక్షణ, వర్క్‌షాప్‌లు, సెమినార్ల నిర్వహణకు ఈ నిధులను వెచ్చిస్తారు. వెనుకబడిన వర్గాలు, గ్రామీణ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో ఈ వర్సిటీకి రెండో విడతలో ప్రాధాన్యం దక్కింది.

రహదారిపైనే మురుగు నీరు

- మురికి నీటిలో విషసర్పాలు, క్రిమి కీటకాలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

విశాలాంధ్ర - టెక్కలి: కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి నీరు రహదారులపై నిల్వ ఉండిపోతోంది. దీంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రంలో స్థానిక శ్రీనివాస నగర్, ఎన్టీఆర్ కాలనీ, సైనిక నగర్ మొదలైన వీధులలో వీధి కాలువలు, రహదారులు లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి పైప్రాంతం నుండి కింద ప్రాంతానికి నీరు పొంగిపొర్లుతోంది. కానీ కొన్ని వీధులలో కాలువలు లేకపోవడంతో రహదారి మార్గంలో మురికి నీరు నిల్వ ఉండిపోయి ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. మురికి నీరు నిల్వ ఉండడంతో ఆ మురికి నీటిలో క్రిమి కీటకాలు, విష సర్పాలతో రాత్రి సమయాలలో బయటికి రావాలంటే స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీధివాసులు ఇళ్లల్లో వాడిన మురికి నీరు రహదారులపై నిల్వ ఉండటంతో దోమ కాటుకు గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారు. కొన్ని వీధులలో అసలు రహదారులు లేక అనేక కష్టాలు పడుతున్నామని, మా సమస్యలను ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని దిగులు చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపాటి వర్షానికే అంబేద్కర్ జంక్షన్ నుండి శ్రీనివాస నగర్, ఎన్టీఆర్ కాలనీ, తొలిసూరిపల్లి, భగవానపురం గ్రామాలకి వెళ్లాలంటే రహదారి గుంతలతో అనేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. రహదారిలో ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూలుకు వెళ్లే విద్యార్థులు, పనులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగస్తులు, ప్రజలు నిత్యం తిరుగుతూ రద్దీగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో ఎక్కడపడితే అక్కడ నీరు నిల్వ ఉండడంతో నడవడానికి వీలు లేకుండా ఉంది. టెక్కలిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ కాలువలు, రహదారులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మానవ వనరుల అభివృద్ధే దేశానికి సంపద

- మంత్రి అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర - టెక్కలి/కోటబొమ్మాళి: మానవ వనరుల అభివృద్ధే దేశానికి పెద్ద సంపదని, నాణ్యమైన విద్యతోనే నైపుణ్యం గల మానవ వనరులు తీర్చిదిద్దడం సాధ్యపడుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళి మండలం కొత్తపేటలో కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో రూ.కోటీ పది లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 2011లో ఇక్కడి కస్తూరిబా గాంధీ పాఠశాల ఆరు నుండి పదవ తరగతి వరకూ ప్రారంభమైందని, తమ హయాంలోనే 2018లో జూనియర్ కళాశాలగా అప్ గ్రేడ్ చేసామని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పటికి 35 శాతం పనులతో అర్ధాంతరంగా నిలిచిన అదనపు తరగతుల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, ఆర్ట్స్, క్రాఫ్ట్స్ లాంటి అంశాలలో మెరుగైన శిక్షణ ఇవ్వడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని సాధించే విధంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. పాఠశాల ప్రక్కనే 13 సెంట్లు ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, దీనిని ఆట స్థలం కోసం కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలో అదనపు డార్మెటరీలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష, ఆర్‌టీఈ చట్టం, పాఠశాల మౌలిక సదుపాయాలు, సౌకర్యాల మెరుగుదల, రెసిడెన్షియల్ హాస్టల్ భవనాలు, ఉపాధ్యాయుల లభ్యత, ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, ఉచిత పాఠ్య పుస్తకాలు, పిల్లలకు ఏకరూప దుస్తులు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, పీఎం పోషణ్ వంటి పథకాలు పాఠశాలల్లో పిల్లల నమోదును పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. కళాశాల భవనాల ప్రారంభోత్సవం అనంతరం కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, ఈఈ రమణమూర్తి, ఏఈ రామానాయుడు, ప్రిన్సిపాల్ కే.లక్ష్మీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రిస్మస్ హైటీ వేడుకలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: క్రిస్మస్ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డిసెంబర్ 25 క్రిస్మస్ శుభ సందర్భంగా ఈనెల 23వ తేదీ సోమవారం కోడిరామమూర్తి స్టేడియం ప్రక్కన గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కళావేదికలో హైటీ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి క్రిస్టియన్ పెద్దలు, జిల్లాలోని ఆయా సంఘాలకు సంబంధించి సంఘ కాపరులు, మైనార్టీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జీడి పరిశ్రమలో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - మందస: మందస మండలం హరిపురంలో గల వెంకట బాలమణి జీడి పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా హుటాహుటిన పలాస, మందస కేంద్రాల నుండి రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. జీడి పరిశ్రమలో నిల్వ ఉంచిన జీడిపిక్కల బస్తాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు 2.5 కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా ఫైర్ అధికారి సోమేశ్వరరావు అంచనా వేస్తున్నారు. కోట్లాది రూపాయల ఆస్తినష్టం జరగడంతో యజమాని యస్వంత్‌కుమార్ కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు.

కాకినాడ ఆదిత్యలో గణిత దినోత్సవం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ప్రక్కన ఉన్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ బిఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ కె.శివశంకర్‌లు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి యువత చిన్నతనం నుండి గణితం అంటే ఒక రకమైన భయంతో ఉన్నారన్నారు. దాన్ని విడిచి పెట్టాలని, శాస్త్ర సాంకేతిక రంగాలలో గణితం ఎంతో ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. రామానుజన్ గణితంలో ఎన్నో పరిశోధనలు చేశారన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, పైడి రాజు, చైతన్య స్వరూప్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు అండగా ప్రభుత్వం

- ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

విశాలాంధ్ర -లావేరు/రణస్థలంః కష్టపడే ప్రతీ కార్యకర్తకు అండగా ప్రభుత్వం అండగా నిలబడుతుందని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. మండలంలో టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావడానికి కృషి చేయాలని, ప్రతి కార్యకర్తకు తాము అండగా ఉంటామని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూ పార్టీ శ్రేణుల్లో ఒక కొత్త ఉత్తేజాన్ని నింపిందని, ఈ కార్యక్రమం ద్వారా పార్టీకి మరింత బలం చేకూరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముప్పిడి సురేష్, మాజీ ఎంపీపీ మీసాల వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ రాజాపంతులు ప్రకాశ్ రావు, మాజీ ఏఎంసీ సభ్యులు తోటయ్య దొర, జగ్గన్న దొర, భాస్కర్ లావేరు మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

హై లెవెల్ ఛానల్ ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

- నారాయణపురం మరమ్మతులు చేపడతాం
- రైతు అవసరాల మేరకు భవిష్యత్ ప్రణాళిక
- ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు

విశాలాంధ్ర - ఆమదాలవలస: నారాయణ పురం కుడి, ఎడమ కాలవల హై లెవెల్ ఛానల్ ఆయకట్టు ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని హై లెవెల్ ప్రాజెక్ట్ చైర్మన్ సనపల డిల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ ఆయకట్టు పరిరక్షణలో భాగంగా నారాయణపురం ఆనకట్టపై షట్టర్లు ఏర్పాటు చేసి కుడి, ఎడమ కాలువలకు నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. 2014 టీడీపీ ప్రభుత్వం హయాంలో నారా యణపురం ఆధునీకీకరణకు 141 కోట్ల రూపాయలు జైకా నిధులు మంజూర య్యా యని అప్పట్లో 80 శాతం కుడి, ఎడమ కాలవల సిసి లైనింగ్ పనులకు కేటాయిం చామని వివరించారు. 25 నీటి సంఘాల పరిధిలో ఐదు సాగునీటి సంఘాలు అరసవల్లి, కొర్లకోట, తాడి వలస, గోరింట, పొన్నాడ సంఘాలు ప్రాజెక్ట్ చైర్మన్‌గా తనను ఎన్ను కున్నారని వివరించారు. 39 వేల ఎకరాల రైతులు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. కింతలి, కనిమెట్ట, ఎచ్చెర్ల, కమ్మపేట టేలాండ్ వరకు ఉన్న భూములకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ సందర్భంగా బోర గోవిందరావు, సంపదరావు మురళీధర్ రావు, కోరుకొండ వెంకటరమణ, నూకరాజు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, గురువు బెల్లి నాగేశ్వరరావు, తంగి గురయ్యాలు ఢీల్లేశ్వరరావును అభినందించారు.

యువత పారిశ్రామికంగా వృద్ధి చెందాలి

విశాలాంధ్ర - పొందూరు: యువత పారిశ్రామికంగా వృద్ధి సాధించినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొని అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో ఏదేశంలో లేని యువశక్తి భారత్‌కే సొంతమని 20 ఏళ్ళ తరువాత భారతదేశం ప్రపంచంలో మెదటిస్థానంలో ఉంటుందన్నారు. యువత ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతంగా ఆర్థికంగా, పారిశ్రామికంగా వృద్ధి చెంది పలువురికి ఉద్యోగ, ఉపాది కల్పన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాడాన శేషాగిరి నాయుడు, ఎంపీటీసీ బడాన హారిక, నాయకులు కూన ప్రమీల, అనకాపల్లి విజయలక్ష్మి,కూన సత్యనారాయణ, సీహెచ్ రామ్మోహన్, ఎం.రమేష్, బి. శంకరబాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు ట్రాఫిక్ నిబంధనలు పట్టవా...!

- బిల్లు లేని సరుకు, అన్‌లోడ్‌కు ఆరాటం
- కొమ్ముకాస్తున్న నాయకులు
- పోలీసులది ధృతరాష్ట్ర పాలన

విశాలాంధ్ర - ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో వ్యాపారుల ఆధిపత్యంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహన చోదకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. సెలవు రోజు వస్తే చాలు ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం వారి అక్రమ వ్యాపారానికి తెరతీస్తారు. ఎటువంటి బిల్లులు లేని వస్తువులు ఇతర ప్రాంతాల నుంచి ఆదివారం పూట ఆముదాలవలసకు దిగుమతి అవుతాయి. స్థానిక నాయకులు అండ దండలతో వ్యాపారులు రోడ్డుకు అడ్డంగా వస్తువుల లోడుతో ఉన్న వాహనాలను నిలిపి వేసి అన్‌లోడ్ చేస్తారు. ఇదంతా చూసిన పోలీసులు ధృతరాష్ట్ర పాలన సాగిస్తున్నారు. పట్టణంలో ఎటువంటి పార్కింగ్ స్థలం లేకపోయినప్పటికీ రోడ్డుపై ఉన్న ద్విచక్ర వాహనాలకు ఫైన్ వేసే పోలీసులు భారీ వాహనాలు అడ్డంగా ఉన్నప్పటికీ కనీస చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇతర వాహనాలకు అంతరాయం కలుగుతున్నప్పటికీ ఆముదాల వలస పోలీసులు మామూళ్ల మత్తులోనే జోగుతున్నారన్న విమర్శలు గుప్పు మంటున్నాయి. అసలే ఇరుకు రోడ్లు ఆపై రోడ్లపైనే తోపుడు బల్లు వీటికి చాలదు అన్నట్టుగా ఆమదాలవలసకు చెందిన వ్యాపారి నిత్యం తనకు గోదాములకు వచ్చే సరుకులు రోడ్డుపై లారీలు పెట్టి గోదాముల్లోకి అన్లోడ్ చేస్తూ ఉంటారు. బస్సు వచ్చినా కారు వచ్చినా తోవఇచ్చే పరిస్థితి కానరాదు. ఆదివారం సైతం లోగుట్టున టాక్స్ చెల్లించకుండా సరుకులు తెచ్చి సీక్రెట్‌గా నిలువ చేస్తూ ఉంటారు. అందులో భాగంగా ఆదివారం సరుకులతో వచ్చిన లారీని నడి రోడ్డుపైనే గంటలకొలది ఉంచి అన్‌లోడింగ్ చేశారు. బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉన్నా ఇరికించి ఇరికించి వెళ్లాలని హుకుం జారీ చేశారు. అంతే ఆర్టీసీ బస్సుల సైతం వ్యాపారి చెప్పినట్టు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాకేమవు తుందిలే అంటూ వ్యాపారులు విర్రవీగి పోతున్నారు. ప్రశ్నించిన వారిపై ప్రశ్న వేయడమే కాకుండా మాకు పోలీసులు, రాజకీయ నాయకులు తెలుసంటూ బహిరంగ ప్రకటన చేయడం కొస మెరుపు. ట్రాఫిక్ లేని సమయంలో రాత్రి సమయాల్లో చేయవలసిన పనులు అటు వాహనదారులకు ఇటు బస్సు ప్రయాణికులకు ఇబ్బంది పెట్టి రోడ్డుపై లారీలు నిలబెట్టడం విడ్డూరంగా ఉంది. పోలీస్ అధికారులు ఇక్కడకు వచ్చిన కొత్తలో విలేకరుల సమావేశంలో ట్రాఫిక్ నిబంధనలపై విచ్చాపాటిగా చర్చిస్తారే తప్ప అమలు జరిపిన దాఖలాలు లేవు. ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించవలసిన పోలీసులు చూసి చూడనట్టు వ్యవహరించడమే ఇందుకు కారణమని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో అంటున్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు: డీఈఓ

విశాలాంధ్ర - శ్రీకాకుళం: విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య అన్నారు. జిల్లాలోని వివిధ స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు డిసెంబర్ 16 నుండి 22 వరకు వారం రోజుల పాటు జరిగిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని, విద్యార్థులు సమాజ సేవ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ వంటి విలువలను నేర్చుకుంటారని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. శ్రీకాకుళం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో జరిగిన ఈ శిక్షణలో 36 మంది స్కౌట్ మాస్టర్లు, 33 మంది గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. వివిధ రంగాల నిపుణులుగా ఉన్న డి.ఎల్ నారాయణ, బి.శివ నాగిరెడ్డి, కే.దుర్గా నాగేశ్వరరావు, పి.సుశీల, జి.బుజ్జిబాబు, రాజేశ్వరి, ప్రమీలలు ఈ శిక్షణను నిర్వహించారు. జిల్లా విద్యాధికారి డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, జాయింట్ సెక్రటరీ వి.వాగ్దేవి, ఉపవిద్యాధికారి విజయకుమారి వంటి ప్రముఖులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వాయుగుండం... అన్నదాతకు కష్టం

- పలు చోట్ల నీటమునిగిన పంట
- తడిచిన ధాన్యంతో అవస్థలు

విశాలాంధ్ర - కవిటి: వాయుగుండం కారణంగా గత రెండు రోజులు కురిసిన వర్షాలకు అన్నదాత అవస్థలు పడుతున్నారు. పండించిన పంటను ఇంటికి తీసుకెళ్లడానికి సిద్ధపడుతున్న తరుణంలో వాతావరణం అడ్డుపడడంతో పలు గ్రామాల్లో నూర్పు చేసిన ధాన్యం పొలాలలోనే టార్పాలిన్లు కప్పి ఉంచినప్పటికీ చాలా చోట్ల ధాన్యం తడిచిపోయాయి. ఆదివారం వర్షం తగ్గడంతో వారంతా పొలాల్లో తడిచిన వరి పణలను గట్టులపైన, రోడ్డుపైన ఆరవేసే పనిలో పడ్డారు. నూర్పు చేసిన ధాన్యంను ఎండబెట్టేందుకు కష్టపడు తున్నారు. ఇచ్ఛాపురం నియోజక వర్గంలో కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి మండలాల్లో వాయుగుండం ప్రభావంతో శుక్ర, శనివారాల్లో వర్షం పడటంతో రైతులపై ఆర్థిక భారం మాత్రం భారీగానే పడింది. పండించిన పంటను ఎలాగైనా దక్కించుకునేందుకు ఖర్చులకు వెకుకాడక కూలీలు అడిగినంత చెల్లించి వరి పనలు తడవకుండా కుప్పలు వేయించారు. కోసిన వరి పూర్తిగా ఎండకముందే కుప్పలు వేయించటంతో ధాన్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదే జరిగితే కనీస ధర రాదని వాపోతున్నారు. ఇంకను నియోజక వర్గంలో 60 శాతం పంట నేలపైనే ఉంది. కవిటి మండలంలో 530 ఎకరాలు కుప్పలు వేయగా 90 ఎకరాల్లో కోసిన పంట నీటిలో తడిచివుంది. ఇంకను 550 ఎకరాలు నీటిలో ఉన్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఏవో బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తడిచిన ధాన్యం, పనలు రక్షణపై రైతులకు సూచనలు చేస్తున్నామని తెలిపారు.

వరి పంటపై అడవి పందుల దాడి

విశాలాంధ్ర - సోంపేట: ఆరుగాలం శ్రమించి అన్నం పెట్టే రైతన్న పట్ల అడవి పందులు కనీసం కనికరించడం లేదు. సోంపేట మండలం అనేక గ్రామాల్లో వరి పంటపై అడవి పందులు యథేచ్ఛగా దాడి చేస్తున్నాయి. బారువ పంచాయతీ పరిధిలోని బీల ప్రాంతం పొలాల్లో అడవి పందులు అధిక మంది రైతుల పంటలను నాశనం చేశాయి. బాగా పండిన ధాన్యంతో కొద్ది రోజుల్లో కోతకు సిద్ధమవుతున్న తరుణంలో అడవి పందులు పంటలను ధ్వంసం చేయడంతో ఆయా రైతులు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. బారువ బీలలో పంట సాగు చేస్తున్న వలాసపురంనకు చెందిన ఢిల్లీరావు అనే రైతుతో పాటు అనేక మంది రైతుల పంటలను అడవి పందులు ధ్వంసం చేశాయి. ఇదే గాకుండా సోంపేట, బూరగాం, బేసి రామచంద్రాపురం, మాకన్నపురం, పాలవలస, శాసనాం, మామిడిపల్లి, తదితర గ్రామాల్లో పంట పొలాల్లో రాత్రి వేళల్లో అడవి పందులు పంటలను ధ్వంసం చేయడంతో వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయి కన్నీరుమున్నీరవుతున్నారు. పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తోన్న రైతులకు అడవి పందుల బెడద తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. రైతులకు ఇదే ప్రధాన జీవనాధారమైన పరిస్థితుల్లో ధాన్యం పంట పందుల వలన నాశనం కావడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. వ్యవసాయ శాఖ అధికారులు అడవి పందులు దాడి చేయకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నప్పటికీ వాటిని అమలు చేయడం రైతులకు సాధ్యం కావడం లేదు. ఇంత నష్టం జరుగుతున్నా పంట పొలాల్లో పందుల విషయంలో అటవీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు నిర్లక్ష్యం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

మంచినీటి బోర్లకు మరమ్మతులు

విశాలాంధ్ర - సంతబమ్మాలి: సంతబొమ్మాలి మేజర్ పంచాయతీ లోపల కట్ట వీధి, లక్ష్మీపురం గ్రామాల్లో మంచినీటి బోర్లకు స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు మరమ్మతులు చేయించారు. గత కొంతకాలంగా ఆయా రెండు ప్రాంతాల్లో మంచినీటి బోర్లు పనిచేయడం లేదని స్థానిక ప్రజలు తెలియజేయడంతో, వెంటనే స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో సంప్రదించి, రెండు బోర్లను మర మ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, స్థానిక పంచాయతీ కార్యదర్శి దుంపల శ్రీనివాసరావు, స్థానిక వార్డు సభ్యులు, బోర్ మెకానిక్ పాల్గొన్నారు.

అమర వీరమణుల త్యాగాలకు చిరునామా శ్రీకాకుళ పోరాటం

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్: శ్రీకాకుళ సాయుధ పోరాటంలోని అసువులు బాసిన అమరవీరుల కుటుంబాల్లో ఉన్న స్త్రీల త్యాగాలు ఎన్నటికీ స్ఫూర్తిదాయకమని, వీటి ఆధారంగా రచయిత అట్టాడ అప్పలనాయుడు రాసిన "నక్షత్ర బాట" నవల అప్పటి ఉద్యమ ఘటనలకు సాక్ష్యాలని మాతృక మాసపత్రిక సంపాదక సభ్యురాలు బత్తుల రమా సుందరి అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆదివారం వరం రెసిడెన్సిలో జరిగిన కార్యక్రమంలో "నక్షత్ర బాట" నవలను అమరవీరుల పిల్లలైనా పంచాది రోజా, అత్తలూరి అరుణ, తామడ అరుణలతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కంచరాను భుజంగరావు ఆహ్వానం పలికారు. ప్రముఖ రచయిత గంటేడ గౌరు నాయుడు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర విప్లవ ఉద్యమానికి సంబంధించిన మరింత సమాచారం, వాస్తవాలతో కూడిన చరిత్రను స్మరించడమే కాకుండా సాహిత్యంలో, వర్తమాన సమాజంలో వాటిని నిక్షిప్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుల పిల్లలు పంచాది రోజా, తామడ అరుణ, అత్తలూరి అరుణలు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు విప్లవంలో అసువులు బాసిన తీరు, తాము పెరిగిన విధానం, తమ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు చిన్నతనం నుంచి ఉద్యమం పట్ల ఆకర్షితు లైన విధానం తదితర అంశాలు గురించి వివరించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి తమ తల్లిదండ్రులు ప్రజల పక్షాన నిలబడి చేసిన పోరాటం చేసినందుకు తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్, రాజాం రచయితల వేదిక అధ్యక్షులు గార రంగనాథం, గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వీజీకే మూర్తి, సాహితీ స్రవంతి శ్రీకాకుళం కన్వీనర్ కేతవరపు శ్రీనివాసరావు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు, ఐద్వా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, రచయితలు సిరికి స్వామి నాయుడు, చింతాడ తిరుమలరావు, పిల్ల తిరుపతిరావు, తామాడా త్రిలోచన, మామిడి క్రాంతి, డాక్టర్ కే. ఉదయ్ కిరణ్, బాడాన శ్యామలరావు, బాల సుధాకర్ మౌళి, అట్టాడ అప్పలనాయుడు మిత్రబృందం తదితరులు నవల విశేషాలను తెలియజేస్తూ అప్పల నాయుడు కలం నుంచి మరిన్ని రచనలు రావాలని ఆకాంక్షించారు. వంకల మాధవరావు, రామచంద్రరావు, కుత్తం వినోద్, తదితర గాయకులు తమ పాటలతో ప్రేక్షకులకు ఉత్తేజం కలిగించారు.

ఘనంగా శారదా మాత జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - టెక్కలి : మండలం తోలుసురుపల్లి గ్రామంలో రామకృష్ణ మఠం వద్ద శారదా మాత జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శారదా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బగాది రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ సభ్యులు నూక కనకారావు, సిగిలిపల్లి పురుషోత్తం ఠాగూర్, మెండ బాలకృష్ణ, మొదలగు రామకృష్ణ మఠం సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించాలంటే గణితంపై పట్టు సాధించాలి

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : పోటీ పరీక్షల్లో రాణించాలంటే గణితంపై పట్టు సాధించాలని. గణిత విద్యతోనే సమాజాభివృద్ధి, దేశవృద్ధి సాధ్యమవుతుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియం ఆధ్వర్యంలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. గణిత విద్యపై అధ్యాపకులు పూర్తిస్థాయిలో నైపుణ్యాలను సాధించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే విధంగా విద్యా బోధన చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని త్వరలోనే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్నం భోజన పథకాన్ని అందిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్యా బలోపేతంపై దృష్టి సారించారని పేర్కొన్నారు. జిల్లాలో విద్యతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఐటి హద్దులను నెలకొల్పుతున్నట్టు చెప్పారు. విజినరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి జిల్లాలో ఓ ఐ టి హబ్బు నెలకొల్పి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. విద్య పాఠశాల తరగతుల గదులకే పరిమితం కాకుండా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపయోగపడేలా అధ్యాపకులు ఉపాధ్యాయులు బోధన అభ్యసన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయపూర్ లో ఛత్తీస్ ఘఢ్ రాష్ట్ర స్థాయి ద్వితీయ తెలుగు మహా సభలు

విశాలాంధ్ర - పలాస : రాయపూర్‌లో మే రెండో వారంలో ఛత్తీస్ ఘఢ్ రాష్ట్రస్థాయి తెలుగు మహా సభలు నిర్వహించేందుకు నిర్ణయించిట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఛత్తీస్ ఘడ్ తెలుగు మహా సంఘం ప్రాంతీయ సమావేశం ఆదివారం రాయపూర్ బాలాజీ విద్యా మందిర్ లో అధ్యక్షుడు ఆర్. మురళి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రతినిధులు,మహా సభలు సన్నాహాలు గురించి విస్తృతంగా చర్చించారు. ఛత్తీస్ ఘఢ్‌లో సుమారు 70 ఏళ్ల నుంచి నివసిస్తున్న తెలుగు వారికి సామాజిక గుర్తింపు లేదని, ఎస్టీ, ఎస్సీ, బీసీ కులాలకు చెందిన తెలుగు వారికి విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఛత్తీస్ ఘఢ్ ప్రభుత్వం కల్పించడం లేదని, దాని వల్ల సుమారు మూడు తరాల నుంచి సామాజికంగా, ఆర్థికంగా వంచింపబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంశాన్ని మహా సభల ప్రధాన వేదికపై ప్రస్తావించే ముందు ఛత్తీస్‌ఘఢ్‌లోని అయా జిల్లాలోని తెలుగు సంస్థలు స్థానిక రాజకీయ ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయాలని కన్వీనర్ రుద్ర మూర్తి ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో సంరక్షకుడు, బాలాజీ విద్యా మందిర్ అధినేత జి స్వామి, సలహాదారుడు ఎం బాబూరావు,కోశాధికారి ఎన్ రమణ మూర్తి, ఉపాధ్యక్షులు బి జోగారావు, బి వేణు గోపాల రావు, టి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి పి ఆది నారాయణ, జి రవి కన్న, సి హెచ్ భీమా రావు, కె వెంకట రావు, ఎస్ ఆర్ ఎన్ గజపతి రాజు, డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

సీఐ అంబటి విజయ్‌కుమార్

విశాలాంధ్ర - టెక్కలి : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ అంబటి విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సంకల్పంలో భాగంగా మండలంలో స్థానిక గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సైబర్ నేరాలపై, మాదకద్రవ్యాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రతి నిమిషం సెల్‌ఫోన్ లేనిది ఏ పని చేయలేకపోతున్నామని, ప్రతిదీ కూడా సెల్ ఫోన్ తోనే లింక్ ఉండడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్డ్, ఆధార్ కార్డ్, పౌర సరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉంటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేని పోనీ ఆశలు చూపించి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఆయన తెలిపారు. సైబర్ నేరాలు పట్ల, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు డ్రగ్స్ వంటి తదితర అంశాలపై విద్యార్థులకు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసే డబ్బులను కాజేస్తున్నారని అన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా కవి సుబ్బారావు పాణిగ్రహి

విశాలాంధ్ర - మందస : ప్రజాకవి సుబ్బారావు పాణిగ్రహి అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. ఆదివారం మండలం రట్టి గ్రామంలో కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి 55వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు మామిడి భీమారావు అధ్యక్షతన జరిగిన సభలో మాధవరావు మాట్లాడుతూ ప్రజల కోసం మాట్లాడడం, పాట పాడడం, ప్రజల పక్షాన నిలబడ్డ కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రహిఎల్లవేళలా ప్రజల హృదయాల్లో ఉంటారని అన్నారు. సనాతన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి శివాలయంలో పూజారిగా ఉన్న పాణిగ్రహి విద్యార్థులను యువకులను ఆకర్షించి సనాతన ధర్మం పేరుతో జరుగుతున్న దోపిడిని వివరించి ప్రజలను చైతన్యవంతం చేశారని గుర్తు చేశారు. గుడులు, గోపురాళ్లతో ప్రజల బతుకులు మారవని సమిష్టిగా సంఘటిత పోరాటాల ద్వారానే ప్రజలు జీవితాల్లో మార్పు వస్తుందని ఆయన భావించే వారన్నారు. దోపిడి అసమానతలు లేని ఒక నూతన సమాజాన్ని ఆకాంక్షించి ఆ సమాజాన్ని సాధించాలంటే అందుకు సాయుధ పోరాటం అవసరమని భావించి తన పెన్నులతో పాటు గన్ను పట్టి సాయుధ పోరులోకి నడిచారని అన్నారు. 1969 డిసెంబర్ 22 నాడు రంగుమట్టి కొండలలో ఆయనతో పాటు తన సహచర కామ్రేడ్స్ వంచాది. నిర్మల, గోరకల. అంకమ్మ, తెలుకల సరస్వతి, నిరంజన్ సాహూ, చెల్లూరు ఉమారావులను కాల్చి చంపారని అన్నారు. వారి అమరత్వాన్ని స్మరించుకోవడం అంటే పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాటమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సాౖర.రామారావు, ఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ జుత్తు.వీరాస్వామి, పిడిఎస్యు యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం వినోద్ సవర బంగ్లా కుమార్ దాలయ్య మహాలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ రూపంలో ఆదుకోవాలి...

విశాలాంధ్ర - టెక్కలి : నియోజకవర్గంలో ఈనెల 18వ తేదీన ఏర్పడిన అల్పపీడనం కారణంగా నష్టం వాటిల్లి నటు వంటి రబీ సీజన్ పంటలైనటువంటి పెసర, మినిము, వేరుశెనగ పండిస్తున్న పంట పొలాలను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో ఈ సంవత్సరం వర్షాలు అనుకూలించి వంటలు బాగా పండాయని రైతుల ఆనందపడేలోపు ఈ నెల 18వ తేదీన ఏర్పడినటువంటి అల్పపీడన ఉధృతం కారణంగా పలు పంట పొలాలు నీటి మునిగాయి. మొక్కలు తెగుళ్లు వచ్చి పంటలు నాశనమైనటువంటి పరిస్థితి నెలకుంది. వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులు పంట నష్టం జరిగిన ప్రాంతాలను సర్వే చేయించి రైతులు ఈ- క్రాప్ ద్వారా చేసుకున్నటువంటి ఫసల్ బీమా యోజన ద్వారా నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ప్రీమియం వర్తింప చేయాలని బిజెపి నాయకులు రైతులు తరపున కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మోర్చా జిల్లా అధ్యక్షులు జాన్ని పరమేశ్వరరావు, స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ చిట్టిబారికి లింగరాజు, రైతులు పాల్గొన్నారు.

తాతకు తగ్గ మనవడు నారా దేవాన్ష్

దేవాన్ష్‌కు ఎమ్మెల్యే శంకర్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : చదరంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన నారా లోకేష్ కుమారుడు దేవాన్ష్ తాత సీఎం చంద్రబాబు నాయుడుకు తగ్గ మనవడు అని నిరూపించుకున్నాడని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేగంగా పావులు కదవడం, వేగవంతమైన చెక్ మేట్ సాల్వర్,175 పజిల్స్ సాధించిన దేవాన్ష్ అద్భుత ప్రతిభ కనబరిచారన్నారు. దేవాన్ష్ మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే శంకర్ ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

ఆసరా సేవలు భేష్ : జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సూర్య ప్రకాష్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : వినియోగ దారులు హక్కులు మరియు ప్రయోజనాల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సంస్థల్లో ఆసరా సంస్థ అగ్ర స్థానంలో నిలుస్తుందని శ్రీకాకుళం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జీ. సూర్యప్రకాశరావు కొనియాడారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల బెంగుళూరు జాతీయ సదస్సుకు వెళ్లి ఎక్సెలెన్స్ అవార్డ్ తీసుకువచ్చిన ఆసరా బృందానికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్ఓ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో రకాల చట్టాలు తీసుకువచ్చింది అని అన్నారు.. సమాజంలో ప్రజలు చైతన్యవంతులు కావాలని అట్లాంటి అప్పుడు మోసాలు అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వస్తువులు, సేవలు నాణ్యత, సామర్థ్యం స్వచ్ఛత ధర ప్రమాణం వీటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకొనే హక్కును కలిగి ఉండటమే వినియోగదారుల హక్కు అని ఆయన వివరించారు. ఈ నెల 18 నుండి 24 వరకు దేశ వ్యాప్తంగా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం వారోత్సవాలు పకడ్బందీగా జరుగుతున్నాయని ఈ నెల 24 న శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘాలు వివిధ స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం ఆసరా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన గోడపత్రికలు వాకర్స్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆసరా సంస్థ శ్రీకాకుళం జిల్లా బాధ్యులు, సీనియర్ న్యాయవాది గేదెల ఇందిరాప్రసాద్ ను జ్ఞాపిక ప్రశంసాపత్రం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసరా సంస్థ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ గంజి యజ్ఞా, సారధి, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, బీవీ రవిశంకర్. ఎస్. సంజీవరావు, గేదెల లక్ష్మీ, వికాస్ విద్యా సంస్థలు అధినేత కూన వేణుగోపాలరావు, లైన్స్ క్లబ్ ఆఫ్ అరసవల్లి ప్రెసిడెంట్ వావిలపల్లి జగన్నాథనాయుడు, బొడ్డేపల్లి ప్రసాద్రావు, గోలీ ఉమామహేశ్వరరావు, ఎండ మోహన్ ,రామ్ బాయి, వాసంతి, విశ్వంభర సాహు, తంగుడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు : ఎమ్మెల్యే గొండు శంకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జామియా మసీదులో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. రెడ్ క్రాస్ సంస్థ నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో సుమారు 80 మంది రక్తదాతలు రక్తం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ జిల్లాలో రక్తం కొరత అధికంగా ఉందని యువత, విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం వలన ఆరోగ్యం మరింతగా మెరుగుపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ అపోహలు వీడి ఏడాదికి రెండుసార్లు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని ఆయన కోరారు. స్వచ్ఛందంగా ముస్లిం మత పెద్దలు ఇటువంటి రక్తదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, జామియా మసీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ రోజు జామియా మసీద్ లో ఏఐఐఐఎఫ్ వారి ద్వారా జిల్లా రెడ్ క్రాస్ వారి సహకారముతో మెగా రక్త దాన కార్యక్రమము నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జగన్మోహన్ రావు, జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, అఖిల భారత మానవతా సందేశ సమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం విభాగం వారు మూడు జిల్లాల కన్వీనర్ అబ్దుల్ కలామ్, సలీమ్, ముజీబ్, హాజి షానవాజ్, హాజి అల్లిజాన్, హాజి అమీరుల్ల బేగ్, సలీమ్ ఖాన్, హాజీ భాయ్యా, అక్బర్ బాషా, సుకుర్ ఖాన్, ఉస్మాన్, సయ్యద్ షఫి, అబ్దుల్, ముబారక్, రోషన్ బాషా, ఎం ఎ రజాక్, యూసుఫ్, బాహాదుర్ బాషా, నిజామ్, బాహాదుర్ జనీ, శైలాని భాయ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరగ్‌పూర్‌లో ఘనంగా శ్రీశయన సంఘ స్వర్ణోత్సవాలు

విశాలాంధ్ర - సోంపేట : పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఖరగ్‌పూర్‌లో అధిక సంఖ్యలో నివశిస్తున్న శ్రీశయన సామాజిక వర్గీయులు సంఘాన్ని ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఆదివారం స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఖరగ్‌పూర్ శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణోత్సవాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం తదితర జిల్లాల శ్రీశయన సంఘాల ప్రతినిధులను ఆహ్వానించారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో నివశిస్తున్న శ్రీశయన సంఘ ప్రతినిధులను కూడా ఆహ్వానించారు. ఖరగ్‌పూర్‌లో నిర్వహించిన శ్రీశయన సంఘం స్వర్ణోత్సవ కార్యక్రమం ఆదివారం ఉదయం నుంచి స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి పతాకావిష్కరణ చేపట్టారు. మధ్యాహ్నం స్వర్ణోత్సవ సమావేశం నిర్వహించి హాజరైన ప్రతినిధులందరూ కార్యక్రమంలో మాట్లాడారు. తెలుగు వాళ్లు లేని పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఖరగ్‌పూర్‌లో శ్రీశయన్లు సంఘంగా ఏర్పడి ఐకమత్యంగా జీవిస్తూ ఒకరినొకరు సహకరించు కుంటూ అభివృద్ధి పథంలో సాగుతున్న శ్రీశయనులకు అక్కడ సంఘం పెద్దలు అందిస్తున్న సహకారాన్ని అభినం దించారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో నివశిస్తున్న శ్రీశయనులకు ఖరగ్‌పూర్ శ్రీశయన సంఘం స్ఫూర్తిదాయకమని పేర్కొ న్నారు. ఖరగ్‌పూర్ శ్రీశయన సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన ప్రతినిధులు ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి హాజరైన శ్రీశయన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి.సత్యనారాయణ, రుప్ప రాంబాబు, డివి దేవ్, యాగంటి రవి, బంటుపల్లి కృష్ణ, సోంపేట ప్రాంతం నుంచి దేవాడ మోహనరావు, దుద్ది వీర్రాజు, దూగాన లోకనాధం, ఆనింగి గంగరాజు, శ్రీకాకుళం నుంచి లాల్‌బహుదూర్‌శాస్త్రి, విశాఖపట్నం నుంచి రాజకుమారి, వరదాన అప్పారావు, బంటుపల్లి శ్రీనివాస్ తదితర పెద్దలు హాజరయ్యారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం పొత్తంగి పంచాయతీ చౌకపేట గ్రామంలో కదంబాల పూర్ణచంద్రరావు అనే వ్యక్తిని బారువ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎస్సైతో పాటు సిబ్బంది దాడి చేసి పూర్ణ చంద్రరావును అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 24 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా శారదాదేవి జయంతి

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలో శ్రీశయన వీధిలో రామకృష్ణ మందిరంలో ఆదివారం శారదాదేవి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పరమహంస సతీమణి శారదాదేవిని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి గరుడాచలం శంకరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

'పాణిగ్రాహి' కి

ప్రజా సంఘాల ఘన నివాళి

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి 55వ వర్ధంతి సందర్భంగా స్థానిక పెద్దపాడు వద్ద గల వానవానిపేటలో ఆదివారం పాణిగ్రాహి చిత్రపటానికి పూల దండలతో ప్రజా సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. పాణిగ్రాహి స్మారక బహిరంగ సభకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మార్పు మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఏడు ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాష్, సన్నశెట్టి రాజశేఖర్, గొరకల బాలకృష్ణ, సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కుసుమ, సార జగన్, డి.అప్పారావు, బి. బాలు, ఎన్. నీలంరాజు, బి.భాస్కరరావు, దప్పు శ్రీను, ప్రసిద్ధ పాత్రికేయులు చింతాడ కృష్ణారావు, నానుబాల ప్రభాకర్ రావు తదితరులు పాల్గొని పాణిగ్రాహికి నివాళులర్పిస్తూ తమ సందేశాలనిచ్చారు. గాంధీనగర్, తంగివానిపేట, జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ఈ సభకు హాజరయ్యారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల ప్రదర్శనలు సభను ఉత్తేజపరిచింది.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని వివిధ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ మేరకు ఆదివారం మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న రామానుజన్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి సభ్యులు బెందాళం రమేష్, మండల కో ఆప్షన్ సభ్యులు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్ చేతులమీదుగా పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఖ్యా శాస్త్రంలో రామానుజన్ చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వం 1962లో సంవత్సరంలో రామానుజన్ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేశారని తెలిపారు. శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, గణిత సూత్రాలు గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా గణిత టాలెంట్ టెస్ట్ లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి కమిటీ చైర్మన్ తెప్పల మోహన రావు,మాజీ సర్పంచ్ ఆరింగి మధు, బెందాళం సురేష్,వజ్జ రంగారావు, ప్రగడ మనిబాబు, గోరకల రామారావు, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టుగలో... మండలంలో గల పెద్ద ఎర్ర గోవింద పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస్ రామానుజం జయంతి సందర్భంగా గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు దేవదాస్ రామానుజన్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. రామానుజన్ గణితంలో చేసిన సేవలు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

బిజి పుట్టుగలో... మండలంలో గల బిజి పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి హెచ్ఎం బాబురావు పూలమాలలు తో అలంకరణ చేశారు. అనంతరం పాఠశాల గణిత ఉపాధ్యాయిని బొరగాపు భవాని కి ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. రామానుజన్ విద్యభ్యాసం అతని గొప్పతనం గూర్చి గణిత ఉపాధ్యాయిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొందల ప్రసాద్, వైకుంఠ రావు, జ్యోత్స్న, జానకి, కుర గౌడ్, బల్లెడ రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : మండలంలోని ధర్మవరం గ్రామంలో గరుడ యూత్ ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి గణిత పోటీల్లో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు బహుమతులు అందజేశారు. వేద గణిత ప్రచారకులు రామారావు గొంగాడ నిర్వహించిన ప్రత్యేక సెమినార్ అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గరుడ యూత్ ప్రతినిధులు రుప్ప లక్ష్మంనాయుడు, మలిపెద్ది జయరాం, రుప్ప రమేష్, మలిపెద్ది చంద్రశేఖర్. రుప్ప రామారావు, టేకి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కవిటీ : చిరస్మరణీయుడు గణిత మేధావి రామానుజన్ గణిత ఉపాధ్యాయులు, అష్టావధని మద్దు తిరుపతిరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలో గల దూగానపుట్టుగ లో గల జ్ఞానోదయ కేంద్రం (గ్రంథాలయం) ఘనంగా జాతీయ గణిత దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానోదయ కేంద్రం ఆధ్వర్యంలో సోంపేట, దూగానపుట్టుగ గ్రామాలలో ఏకకాలంలో జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలకు చెందిన 140 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో సిలగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్ చరణ్ మొదటి బహుమతిని, కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నెయ్యల హాసిని ద్వితీయ బహుమతిని,సోంపేటకు చెందిన జె వై పాఠశాల విద్యార్థి పీ.దీప్సి శ్రీ తృతీయ బహుమతిని, మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బోరుభద్ర చరణ్ కి ప్రత్యేక బహుమతులు సాధించారు.ఈ కార్యక్రమానికి సోంపేట మండలం బూరగాం పాఠశాల ప్రముఖ గణిత ఉపాధ్యాయులు అష్టావధాని మధు తిరుపతి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు గణితానికి సంబంధించిన గణిత మెలికవులు నేర్పించి వారిలో ఉత్సాహం నింపారు. టాలెంట్ టెస్ట్ లో గెలుపొందిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.2,500 వేలు సీల్డ్, ద్వితీయ బహుమతి రూ .1500 వందలు, సీల్డ్ తృతీయ బహుమతి రూ. 1000 సీల్డ్, ప్రత్యేక బహుమతిని బహుమతి సీల్డు పవనపుత్ర సేవా సంస్థ వారు అందించారు. అనంతరం మద్దు తిరుపతిరావు, ప్రమోద్ పాడి, మజ్జీ శ్రీధర్ లకు గ్రంథాలయం సభ్యులు ఘనంగా సన్మానించి మెమొంటోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం సంచాలకులు దూగాన తిరుపతిరావు, ఉపాధ్యాయులు బల్ల కాంతారావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, యువకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.